


# ప్రధానోపాధ్యాయుని పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

### - జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి జనవరి 20.

తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసనగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బేగంపేట్ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ మాట్లాడుతూ రాములు పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే కఠినంగా శిక్షించాలని, పాఠశాల విధులు నిర్వహిస్తున్న సమయంలో ఉపాధ్యాయులపై ఎవరు దాడి చేసిన కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. నెల రోజులు గడుస్తున్నా నేటి వరకు నిందితుల పైన ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడం శోచనీయమని, వెంటనే కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్ కుమార్, సంజీవ్, రాములు, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్, దివాకర్, రాజేందర్, కమలాకర్, అమరేందర్, ప్రసాద్, ఎం.వసంత, జి.వసంత, పావని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు మందలించడంతో యువతి ఆత్మహత్య



సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి జనవరి 20.

వివాహం జరిగిన వ్యక్తిని ప్రేమించిందని తల్లిదండ్రులు మందలించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన గుండారం అంజలి (20) అదే గ్రామానికి చెందిన అయ్యాగల్ల నాగరాజుతో ప్రేమలో పడి మూడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. అప్పటికే నాగరాజుకి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంజలి తల్లిదండ్రులు కూతురు కనిపించడం లేదని రాయపోల్ పోలీస్ స్టేషన్ లో యువతి కనపడడం లేదని కేసు నమోదు చేశారు. పోలీసులు అంజలి నాగరాజు పోలీస్ స్టేషన్ కు వచ్చారు. గ్రామస్తులు కుటుంబ సమక్షంలో ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి ఎవరింటికి వారిని పంపించారు. దానితో సమస్య సద్దుమణిగింది. ఇటీవల మళ్ళీ అంజలి నాగరాజుతో రహస్యంగా ఫోన్ మాట్లాడుతుందని కుటుంబ సభ్యులకు తెలియడంతో అంజలిని మందలించారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు అంజలి కూడా పనికి వెళ్ళింది. అంజలి మధ్యాహ్నం భోజనం చేయడానికి అని ఇంటికి వచ్చింది. కుటుంబ సభ్యులు మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురి చెందిన అంజలి మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

తిరిగి పొలం వద్దకు రావడంలేదని అనుమానంతో కుటుంబ సభ్యులు అంజలికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. అనుమానంతో అదే గ్రామంలో ఉంటున్న అంజలి సోదరికి ఫోన్ చేయగా ఆమె వచ్చి చూసేసరికి అంజలి ఇంట్లో ఉరివేసుకుంది. వెంటనే తల్లిదండ్రులకు విషయం తెలుపగా వచ్చి చూసేసరికి అప్పటికే అంజలి మృతి చెందింది. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు ఇవ్వని పార్టీలకు పతనం తప్పదు

**కాంగ్రెస్ బిజెపిలు బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలి**

**ఓట్లు బీసీలవి.. సీట్లు అగ్రకులాలకు ఎలా కేటాయిస్తారు ?**

**రాహుల్ కాంగ్రెస్ అయితే బీసీలకు టికెట్ ఇవ్వండి - రెడ్డి కాంగ్రెస్ అయితే రెడ్డికే ఇవ్వండి**

**బీసీలకు టికెట్లు ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా బీసీలను బరిలో నిలుపుతాం**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**

హైదరాబాద్ : రేపు మార్చ్ లో జరగబోయే శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు ఇవ్వాల్సిందేనని, టిక్కెట్లు ఇవ్వకపోతే ఆ రాజకీయ పార్టీలకు పతనం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.నేడు హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇతర బీసీ సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు ఓట్లు బీసీలవి అయితే సీట్లు అగ్రకులాలకు ఇవ్వడం రాజకీయ పార్టీలకు అనవాయితీగా మారిందన్నారు, అధికారం లేనప్పుడు అధికారంలోకి రావడానికి గెలుపు గుర్రాల పేరుతో అగ్రకులాలకే టికెట్ లు ఇచ్చిన రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు కూడా అగ్రకులాలకి టికెట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.

ముఖ్యంగా కరీంనగర్, నిజాంబాద్, మెదక్. అదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా ఇప్పటికే బీజేపీ పార్టీ అగ్రకుల రెడ్డి అభ్యర్థికి సీటు ప్రకటించడం జరిగిందని, అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా బిజెపి బాటలోనే రెడ్లకుటికెట్లు ఇవ్వాలని తహ తహ లాడుతున్నదాతం శోచనీయమన్నారు.నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలైన పిఆర్టియు, యుటిఎఫ్, టిపియస్,దాదాపు అన్ని సంఘాలు అగ్రకుల రెడ్డి అభ్యర్థులను బరిలోకి దింపుతున్నాయనీ,ఇవి పూర్తిగా బీసీలను విస్మరించి రెండు మూడు శాతం లేని అగ్రకులాలను బరిలోకి దింపితే వారిని ఈ ఎన్నికలలో కచ్చితంగా ఓడించి తీరుతామని ఆయన హెచ్చరించారు.ఇటీవల పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మిత్ర పక్షాలకు మద్దతిస్తామని, కరీంనగర్, నిజాంబాద్, మెదక్ అదిలాబాద్ పట్టభద్రులనియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలుపుతామని పేర్కొన్నారని, వారి మిత్రపక్షలైన ఉపాధ్యాయ సంఘాల వారు ఇప్పటికే అగ్రకుల రెడ్డి అభ్యర్థులను ప్రకటించారని దీనిని బట్టి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెడ్డి అభ్యర్థులకి మద్దతుఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తుందన్నారు, కనీసం పట్టభద్రుల అభ్యర్థి అయిన బీసీలకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఒకవైపు బీసీ కులగణన జరిగి బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా దక్కాలని ఆయన మాట్లాడుతుంటే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఇందుకు విరుద్ధంగాబీసీలకు టికెట్లు ఇవ్వకుండా రెడ్డి అభ్యర్థులకే టికెట్ లు ఇస్తూ రాహుల్ మాటను బుట్ట దాఖలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అసలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది రాహుల్ కాంగ్రెస్ న? రెడ్డి కాంగ్రెస్ న తెలవట్లేదని రాహుల్ కాంగ్రెస్ అయితే బీసీలకు టికెట్ ఇవ్వాలని, రెడ్డి కాంగ్రెస్ అయితే రెడ్లకే టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరిగే శాసనమండలి ఎన్నికలే బీసీలకు టికెట్లు ఇవ్వడం రాజకీయ పార్టీలు ఒక అవకాశం గా తీసుకోవాలని లేకుంటే భవిష్యత్తులో అగ్రకుల రాజకీయ పార్టీలు బీసీల అగ్రహానికి గురై తమ గోతిని తావే తవ్వుకుంటాయని.. అంతిమంగా అగ్రకుల రాజకీయ పార్టీలకు కాలం చెల్లి బీసీలకు రాజకీయ శకం ఆరంభమవుతుందని 2029లో బీసీల రాజకీయ అధికారానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే పునాదికానున్నాయని ఆయన హెచ్చరించారు. బీసీ కులగన చేసి కూడా బీసీలకు టికెట్లు ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీని భవిష్యత్తులో బీసీలు ఇక ఎప్పటికీ నమ్మరని ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టి కూడా తీసుకుపోతామని ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లోనే ఎమ్మెల్సీ ఎన్నికలు బీసీల పాత్ర, భవిష్యత్ కార్యాచరణ పై హైదరాబాదులో బీసీ మేధావులు, బిసి సంఘాలు, కుల సంఘాలతో విస్తృత స్థాయి సమావేశాన్నిఏర్పాటు చేసి బీసీలకు అగ్రకుల రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వని పక్షంలో స్వతంత్రంగా బీసీ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబెట్టడానికి ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ సమావేశం లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ మహిళా సంఘం బీసీ మహిళా సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఇంద్రం రజక తదితరులు పాల్గొన్నారు

# వాట్సప్‌లో సివిక్ సర్వీసెస్

## ఈ గవర్నెన్స్ లో నయా టెక్నాలజీ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్‌లో పౌర సేవలు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలో ఈ గవర్నెన్స్‌లో మెటా సేవల్ని వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. అందరికి పౌర సేవల్ని వాట్సప్ ద్వారా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఏపీలో శనివారంనుంచి రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. మొబైల్ ఫోన్‌లోనే ప్రజలకు 150 రకాల పౌర సేవల్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.ఏపీలో పౌర సేవలు, ప్రభుత్వ ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే ప్రజలు నేరుగా వాట్సాప్‌లో పౌర సేవలు అందుకునే రోజులు వచ్చేశాయి.వాట్సాప్ మాతృ సంస్థ మెటాతో ఏపీ ప్రభుత్వం ఈ మేరకు కీలక ఒప్పందం చేసుకుంది. మెరుగైన పౌరసేవల కోసం మెటాతో ఏపీ ప్రభుత్వం గత ఏడాది నవంబర్ 30న ఒప్పందం కుదుర్చుకుంది. వాట్సాప్ బిజినెస్ ద్వారా 100 -150 రకాల పౌరసేవలు నేరుగా అందుకునే అవకాశం లభిస్తుంది.

ఈ సేవలు ఇక వాట్సాప్‌లోనే

1).జీ2సీ (ప్రభుత్వం నుండి పౌరులకు)

2).బీ2సీ (వ్యాపారం నుండి వినియోగదారునికి)

3).జీ2జీ (ప్రభుత్వం నుండి ప్రభుత్వం)

**150 రకాల పౌరసేవలు..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాట్సాప్ కనీం 100రకాల సేవలను ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. మొదటి దశలో వాణిజ్యరంగంలో సమర్థవంతమైన ప్రభుత్వ సర్వీస్ డెలివరీ కోసం రీ ఇంజనీరింగ్ విధానాలను అమలుచేస్తారు. రెండోదశలో ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా సులభతరంగా పౌరసేవలు అందిస్తారు.ఈ ప్రక్రియలో, ఈ క్రింది విధంగా వివిధ రకాలసేవలను అందించడానికి ప్రాథమికంగా నిర్ణయించారు.

**1.ఎండోమెంట్ సేవలు:** ఆంధ్రప్రదేశ్‌లోని 7 ప్రధాన దేవాలయాల్లో దర్శనం, వసతి, విరాళాలు, వివిధరకాల సేవల కోసం స్లాట్‌ను బుక్ చేసుకోవడం వంటి సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయి.

**2. రెవెన్యూ సేవలు:** పౌరులు వివిధ రకాల సేవల కోసం చేసుకున్న తమ దరఖాస్తుల స్థితిని సులభంగా తనిఖీ చేసుకోవడానికి వీలుకలుగుతుంది. పారదర్శకమైన యాక్సెస్ తో సర్వే నంబర్లు, భూభాగాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంటాయి. సర్వే నంబర్ల ఆధారంగా భూమిని గుర్తించడంలో సహాయం అందుంది. ఈ సమాచారాన్ని స్వతంత్రంగా కనుగొనడంలో వినియోగదారుల యాక్సెస్ మెరుగుపరుస్తారు.కులం, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం అభ్యర్థనలను క్రమబద్ధీకరిస్తారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ కోసం వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ప్రజలకు లభిస్తుంది.

**3. పౌర సరఫరాలు...**పౌరులు రేషన్ కార్డ్‌ల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదలయ్యాక రేషన్ కార్డులను జారీ చేయడం, రేషన్ పంపిణీ స్టేటస్ ను అప్ డేట్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి.

**4. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ అఫైర్స్ ..**కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వాణిజ్య లైసెన్సులు వంటి సేవలు వాట్సాప్ ద్వారా పొందే అవకాశం ఏర్పడుంది.

**5. సేవల నమోదు...** ప్రభుత్వ శాఖల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంబంధించి చిప్త్రజీబిబంజూజూను సాంకేతిక భాగస్వామిగా సేవలను అభివృద్ధి చేస్తుంది. భద్రతను నిర్ధారించే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి సకాలంలో నోటిఫికేషన్‌లు, సర్టిఫికెట్‌లు జారీ, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ మొదలైన వాటి కోసం దరఖాస్తు చేయడానికి అవకాశమేర్పడుంది.

**6. విద్యుత్ శాఖ..**విద్యుత్ శాఖలోని పరిధిలో విద్యుత్ బిల్లు చెల్లింపునకు వాట్సాప్ ద్వారా అవకాశం లభిస్తుంది. ప్రజల అభ్యర్థనల మేరకు జియో లొకేషన్ ఆధారంగా కొత్త హై-టెన్షన్ లైన్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఇన్‌స్టాల్ చేయడం, ట్రాన్స్‌కో, అంతర్గత కమ్యూనికేషన్ ఛానెల్‌లు, అలర్ట్ సర్వీస్‌లు అందుబాటులోకి వస్తాయి.

**7. పరిశ్రమలు...**పరిశ్రమల శాఖ ఇప్పటికే ఔట్ రీచ్ కమ్యూనికేషన్ కోసం చాట్‌బాట్‌లను ఉపయోగిస్తోంది. యుటిలిటీ సేవలను ఏకీకృతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.వ్యవస్థాపకుల కోసంసింగిల్ డెస్క్ పోర్టల్‌ను ఏకీకృతం చేయడం కోసం విధివిధానాలు సిద్ధమయ్యాయి. భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేయడం,పెట్టుబడి విధానం, ప్రమోషన్ వంటివాటికి అవకాశం లభిస్తుంది.

8. రవాణాశాఖ.. అన్ని రవాణా లైసెన్స్‌లకు సంబంధించిన సేవలు, అనుమతులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి, వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి అన్ని ఫేస్‌లెస్ సర్వీస్‌లను చిప్త్రజీబిబంజూజూతో ఏకీకృతం చేసి సేవలను అందుబాటులోకి తెస్తారు. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మోడల్ లో ఎపిఎస్ ఆర్టీసితో మెటా టీమ్ కలిసి పనిచేస్తుంది. టిక్కెట్ బుకింగ్, పార్శిల్ బుకింగ్‌ల కోసం ంఖూఖీఅ లో సేవలను ఏకీకృతం చేస్తారు.

**9. పాఠశాల విద్య...**తల్లిదండ్రులు, విద్యార్థులు, డిపార్ట్‌మెంట్ కార్యనిర్వాహకులకు ముఖ్యమైన సమాచారాన్ని పంపడం వంటిసేవలు వాట్సాప్‌తో అనుసంధానం చేయడం వల్ల సులభతరమవుతాయి. విద్యార్థుల హాజరు, పనితీరుకు సంబంధించి 7 మిలియన్ల మంది తల్లిదండ్రులతో కమ్యూనికేట్ చేయడానికి మొబైల్ నంబర్‌తో పాటు ఆధార్ ప్రామాణీకరణతో మెసేజింగ్ సిస్టమ్ అందుబాటులోకి వస్తుంది. పాఠ్యప్రణాళిక ఫలితాలను ట్రాక్ చేయడంతోపాటు మెటా బృందం డిజిటల్ నాగ్రిక్ వంటి అదనపు కోర్సులను కూడా అందుబాటులోకి తేవడానికి కృషిచేస్తుంది.

**10. ఉన్నత విద్య...** ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్లు మొదలైన వాటి కోసం హెచ్చరికలను షెడ్యూల్ చేయడం వంటి సమాచారం అప్ డేట్ గా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. స్టూడెంట్ - స్టాఫ్ సపోర్ట్ సర్వీసెస్, వర్చువల్ టీచింగ్ అసిస్టెన్స్, కమ్యూనికేషన్, ఇతర సాఫ్ట్ స్కిల్స్ మెరుగుపరచడానికి ఒఓూ వంటివి అందుబాటులోకి వస్తాయి. విద్యా సేవలకు అంతరాయంలేని యాక్సెస్ కోసం ంఖంంఖీ ఎఆని అనుసంధానిస్తారు. డ్రగ్, పొగాకు రహిత క్యాంపస్‌ల కోసం ప్రచారాలు, యూనివర్శిటీల్లో వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకునే సౌలభ్యం లభిస్తుంది.

**11. నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ...**భారత ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పలురకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయి. స్కిల్ డెవలప్‌మెంట్ అవసరాలపై డేటాను సేకరించేందుకు స్కిల్ సెన్సస్ నిర్వహించడంలో మెటా సహకరిస్తుంది. మెటా బృందం వాయిస్/టెక్ట్స్ ద్వారా డైనమిక్ ప్రతిస్పందనల కోసం ంఎని ఏకీకృతం చేస్తుంది.

**12. ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజి..** ఆయా శాఖల్లో డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్‌లను నిర్ధారించడం కీలకం. చిప్త్రజీబిబంజూజూ అనేది అదనపు కమ్యూనికేషన్ ఛానెల్ మాత్రమే. మొత్తం డేటా ప్రభుత్వం వద్ద ఉన్నందున ఇంటిగ్రేషన్ కోసం వైట్‌లిస్ట్ చేయదగిన సమాచారాన్ని అందుబాటులోకి తెస్తారు. డిపార్ట్‌మెంటల్ సమాచారం ఇంటిగ్రేషన్ కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ప్రణాళికను తయారుచేసి నిర్ణీత కాలవ్యవధిలో ఏకీకృతంచేస్తారు.

**13. గ్రామ సచివాలయాలు, వార్డుసచివాలయ విభాగం**

గ్రామ, వార్డు సచివాలయ్యాల్లో సమర్థవంతమైన సర్వీస్ డెలివరీ కోసం 29 విభాగాల్లో 350+ సేవలు ఇప్పటికే ఏకీకృతం చేశారు. వివిధ విభాగాలకు అనుసంధానించడం ద్వారా ఇతర డైనమిక్ సేవలను సమాంతరంగా అందుబాటులోకి తెస్తారు.వాట్సాప్ గంటకు 10 లక్షల అలర్ట్‌ల సామర్థ్యంతో రియల్ టైమ్ నోటిఫికేషన్‌లను సులభతరం చేస్తుందని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. పర్యాటకరంగానికి సంబంధించి అవసరమైన అప్ డేట్లు, ప్రయాణ సమాచారం అందుబాటులోకి వస్తుంది.

పౌరులు తమ సమస్యలను తెలియజేయడానికి క్రమబద్ధమైన వేదికగా ఉపకరిస్తుంది. రాష్ట్రంలో అమలవుతున్న(న్నా) ప్రాజెక్ట్‌లు, రహదారి పరిస్థితులు వంటివాటిపై రెగ్యులర్ అప్‌డేట్‌లు లభిస్తాయి.

వ్యవసాయ రంగానికి సంబంధించి మార్కెట్ ధరలు, వాతావరణం, ఉత్తమ యాజమాన్య నిర్వహణ పద్ధతులపై సమాచారం పొందవచ్చు. వివిధ పన్నులకు సంబంధించిన సమాచారం, గడువులు, విధానాలపై కమ్యూనికేషన్ సులభతరం అవుతుంది. ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లో క్రమబద్ధీకరిస్తారని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ఈ సేవల్ని శనివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి

# స్టీల్ ప్లాంట్‌కు ప్రాణం

విశాఖపట్టణం : విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. ఈ విషయంపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఉక్కు రంగం ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో, ఎన్నో పోరాటాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, రాజకీయ పార్టీలు చాలా రోజులుగా పోరాటం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలువరిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం రూ. 11,440 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది."విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. నిన్నటి మంత్రివర్గ సమావేశంలో, ఈ ప్లాంట్ కోసం రూ. 10,000 కోట్లకు పైగా ఈక్విటీ మద్దతును అందించాలని నిర్ణయించాము. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఉక్కు రంగం ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఈ నిర్ణయం తీసుకున్నాము"- ప్రధాని మోదీవిశాఖ స్టీల్ ప్లాంట్ ను లాభాల్లోకి తేవడమే కేంద్రం లక్ష్యమని కేంద్రమంత్రి కుమారస్వామి తెలిపారు. రానున్న రెండు, మూడేళ్లలో స్టీల్ ప్లాంట్ ను దేశంలోనే నంబర్ వన్ గా చేస్తామన్నారు. ఇకపై స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రసక్తే లేదన్నారు. ఈరోజు ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ మొదటిదేనని, భవిష్యత్తులో మరిన్ని ఆర్థిక సాయాల ప్రకటనలు చేస్తామని కేంద్రమంత్రి ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు గెలిచారు. ఈ రోజు, నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. టీడీపీ-జేఎస్పీ-బీజేపీ కూటమికి సేవ చేయడానికి ఆశీర్వదించినందుకు రాష్ట్ర ప్రజలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. రాష్ట్ర పునర్ నిర్మాణంలో మనం గెలిచాము. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా , జేపీ నడ్డాకు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు పట్ల వారి నిబద్ధతకు ధన్యవాదాలు. ఈ విజయం సాధించినందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి అభినందనలు. ఈ విజయం చివరి ఓటు వేసే వరకు అన్ని అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొన్న మా నాయకులు, కార్యకర్తల కృషి అంకితభావం ఫలితంగా భావిస్తున్నాను. వారి అచంచలమైన నిబద్ధతకు ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ అద్భుతమైన విజయానికి వారిని అభినందిస్తున్నాను. ప్రధాని మోదీ స్టీల్ ప్లాంట్‌కు అచంచలమైన మద్దతు ఇచ్చినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇది వికసిత్ భారత్ - వికసిత్ ఆంధ్రలో భాగంగా ప్రధానమంత్రి మోదీ జాతి నిర్మాణం, దార్శనికతకు దోహదపడుతుందని నేను హామీ ఇస్తున్నాను.ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి.కుమార స్వామి మద్దతు, సానుకూల ప్రతిస్పందనకు ప్రత్యేక ధన్యవాదాలు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఒక కర్మాగారం కంటే ఎక్కువ - ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల పోరాటాలు, స్ఫూర్తికి స్మారక చిహ్నంగా నిలుస్తుంది. అందరి హృదయాలలో, ముఖ్యంగా వైజాగ్ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఇది కేవలం ఎన్నికల హామీ కాదు. ఆంధ్రప్రదేశ్‌కు మంచి రోజులు రాబోతున్నాయి"- సీఎం చంద్రబాబు"ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అంటూ ఒకనాడు ఆంధ్రులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటు పరం చేస్తామని కేంద్రం అంటే కేవలం రూ.7000 కోట్లకు అమ్మేయడానికి ఓకే అన్నది గత వైసీపీ ప్రభుత్వం. స్టీల్ ప్లాంట్ భూములను కారు చౌకగా కొట్టేయడానికి ప్లాన్ చేసింది జగన్ అండ్ కో. కానీ విశాఖ ఉక్కుకు అండగా నిలబడ్డారు చంద్రబాబు. కేంద్రాన్ని ఒప్పించి రూ.11,440 కోట్ల రివైవల్ ప్యాకేజిని సాధించారు" అని టీడీపీ ట్వీట్ చేసింది.

# కోడిపందేలు... సామాన్యులపై కేసులు : ఇదెక్కడి చోద్యం

కాకినాడ : ఆడింది.. వారు... ఆడించింది రాజకీయ ప్రముఖులు.. కానీ బుక్ అయ్యింది మాత్రం సామాన్యులు.. అదికూడా పనివాళ్లు.. తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన కోడిపందేలుకు సంబంధించి కోడిపందేల వద్ద కత్తులు కట్టేవారు.. అక్కడ రోజు కూలీకోసం పనిచేసిన వారు కేసుల్లో ఇరుక్కున్నట్లు తెలుస్తోంది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 1200 మందిపై బైండోవర్ కేసులు నమోదు కాగా ఎక్కువశాతం మంది సామాన్యులే బలయ్యారన్నది వాస్తవంగా కనిపిస్తోంది.ముందెప్పుడూ లేనంతగా ఈ ఏడాది కోడిపందేలు జోరుగా సాగాయి. ఉభయగోదావరి జిల్లాల్లో ఊరికి పది చొప్పున అక్కడ ఇక్కడ అన్న తేడా లేకుండా కోడిపందేలు బరులు ఏర్పాటు చేశారు. ఇక వాటి చెంతనే గుండాటలు, ఇతర జూదాలు, కొన్నిచోట్ల ఏకంగా క్యాసినోలు కూడా నిర్వహించారు. పోలీసుల ఆంక్షలు మాట అటుంచితే ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా కోడిపందేలు, జూదాలు జరగ్గా కోట్లాది రూపాయలు చేతులు మారాయి.కోడిపందేల నిర్వాహణకు ముందు నెల రోజుల నుంచి పోలీసులు గతంలో కోడిపందేలు ఆడుతున్నవారి మీద ఉన్న కేసులు ఆధారంగా, గుండాటలు నిర్వహించే వారిపై నమోదైన కేసులు ఆధారంగా బైండోవర్లు నమోదు చేశారు. అయితే వీరిలో అంతా కూడా సామాన్యులు, కూలినాలీ చేసుకునేవారు, కోళ్ల పోషణను చూసి వాటికి కత్తులు కట్టేవారే ఉన్నారు.గోదావరి జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఈ ఏడాది భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. వీటి వెనుక ప్రతీ మండల పరిధిలో, గ్రామ పరిధిలోనూ రాజకీయ నాయకులు ఉన్నారు. వారిపై ఒక్క కేసు నమోదు కాని పరిస్థితి కనిపించింది. పైగా కోడిపందేల బరులను వీరే దగ్గరుండి ట్రాక్టర్లుతో చదును చేయించి ఆపై అక్కడ షామియానాలు ఏర్పాటు చేయించారు. పైగా బరుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ వారి పేర్లు వేయించుకున్నారు. అయినా వీరిపై కేసులు నమోదు కాకపోవడం విమర్శలపాలవుతోంది. ఈ ఏడాది ఎక్కడ బడితే అక్కడ విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించడంతో చాలా మంది అప్పులు చేసి, ఆస్తులు తాకట్టుపెట్టి మరీ లక్షలు పోగొట్టుకున్న పరిస్థితి కనిపించిందని టాక్ నడుస్తోంది.



## రైతు రుణమాఫీ అయ్యేలా చూడాలని కలెక్టర్ కు వినతి

నాగిరెడ్డిపేట్ జనవరి 20 ప్రజాకలం

రైతురుణమాఫీ నాలుగు విడతలుగా చేపట్టినా తమ రుణం మాఫీ కాలేదని నాగిరెడ్డిపేట మండలానికి చెందిన రైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు సహకార సంఘ సొసైటీలో లక్ష లోపు తమ వ్యవసాయ పంట రుణం ఉందని వివరించారు. అయినప్పటికీ తమ పంట రుణాలు మాఫీ కాలేదని వివరించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని రుణాలు మాఫీ అయ్యేలా చూడాలని కోరారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించండి -కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి,జనవరి20, (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల పరిష్కరించాలంటూ డిప్యూటీ కమిషనర్



రాజును కోరారు. ఈసందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ సఫిల్గుడా పార్కులోని పాత ఆట వస్తువులు వెంటనే మరమ్మతు చేయాలని హెచ్ఎండిఏ నిధులతో చేపట్టిన ఫుట్ పాత్ మరమ్మత్తులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కాలనీ లేఅవుట్లు ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,దోమలు పెరగకుండా ఉండడానికి అధ్యయనం చేయాలని దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే చేయాలని ఈ సందర్భంగా అధికారులకు తెలిపినట్లు కార్పొరేటర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నందు,మురళి, జోగు వెంకటేష్,రవి,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### - కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం,జనవరి20(ప్రజా కలం )

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (87) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-38, ప్రజాపాలన దరఖాస్తులు-10, పిడి హౌసింగ్-9, మొత్తం 87 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుండి నిర్వహించే గ్రామసభల గురించి మున్సిపాలిటీల వార్డుల్లో, గ్రామ పంచాయతీలలో ముందుగా ప్రజలకు తెలిసే విధంగా టామ్ టామ్ వేయించాలని సూచించారు.

## టోర్నమెంట్ నిర్వాహనకు అనుమతి కోసం

### మున్సిపల్ కమిషనర్ కలిసిన

### మణికొండ బాల్ బాడ్మింటన్ చీఫ్ పాట్రాన్ ఆలస్యం నవీన్ కుమార్

### అందె లక్ష్మణ్ రావు అధ్యక్షుడు ఆనంద్ రావు

రాజేంద్రనగర్ జనవరి 20,(ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండ బాల్ బాడ్మింటన్ గతంలో జరిగిన గట్టుప్పల్ లోని తెలంగాణ రాష్ట్ర బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్లో ద్వితీయ బహుమతి సాధించిన ఉత్సాహంతో ప్రస్తుతం మణికొండ బాల్ బాడ్మింటన్ తరపున మణికొండ అలకాపురిలో గల జయశంకర్ పార్క్ లో ఫిబ్రవరి 2 వ తేదీన ఉదయం నుండి రాత్రి వరకూ టోర్నమెంట్ నిర్వహించడానికి తలపెట్టిన దరిమిలా స్థానిక కౌన్సిలర్, మణికొండ బాల్ బాడ్మింటన్ చీఫ్ పాట్రాన్ ఆలస్యం నవీన్ కుమార్ ఆద్వర్యంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ ను కలవడం జరిగింది. ఈ సందర్భముగా ఆడడానికి ఎక్కువ జట్టులు పాల్గొన్న యెడల అవసర నిమిత్తం ఏంజీ పార్కును కూడా వాడుకోవడానికి అనుమతించవలసినదిగా కమిషనర్ ను కోరడం జరిగింది. కమిషనర్ ని కలసిన వారిలో మణికొండ బాల్ బాడ్మింటన్ ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు, అధ్యక్షుడు ఆనంద్ రావు, ఉపాధ్యక్షుడు



### మాలుతుమ్మెద ప్రభుత్వ ఉద్యానవన క్షేత్రంలో

# భారీగా అగ్నిప్రమాదం.

### నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.







నాగిరెడ్డిపేట్ జనవరి20ప్రజాకలం

నాగిరెడ్డిపేట్ మండలం మాలుతుమ్మెద శివారులో గల ప్రభుత్వ ఉద్యానవన క్షేత్రంలో సోమవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉద్యానవన క్షేత్రంలోని ఎండిన గడ్డి, ఎండిన ఆకుల వల్ల ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించిందా లేక ఎవరైనా నిప్పు పెట్టారా అన్న విషయం అర్థం కావడం లేదు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎస్సై మల్లారెడ్డి వెంటనే తన సిబ్బందితో ఉద్యానవన క్షేత్రానికి చేరుకొని ఎల్లారెడ్డి అగ్నిమాపక స్టేషన్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

వెంటనే అగ్నిమాపక అధికారి కిష్టయ్య యంత్రం తన సిబ్బంది తో అక్కడికి చేరుకొని మంటలను అర్పివేసింది. అప్పటికే ఉద్యాన క్షేత్రంలో ని షెడ్, పైపులు చెట్లు కాలిపోయాయి. ఈ ఉద్యానవన క్షేత్రం 60 ఎకరాల్లో విస్తరించిఉంది. ఇందులో మామిడి,జామ,ఉసిరి తో పాటు వివిధ రకాల చెట్లు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి పూత విరవిగా బూసింది.

మామిడి,జామ, ఉసిరి కాయల వల్ల ప్రభుత్వానికి లక్షలాది రూపాయల ఆదాయం లభిస్తుంది. ఈ అగ్నిప్రమాదం వల్ల ఎన్ని చెట్లు కాలిపోయాయి అన్న విషయం ఇతమిద్దంగా తెలియడం లేదు.

రాత్రి కావడం, పొగ వల్ల చెట్లు ఎన్ని కాలిపోయాయి అన్న విషయం ఉదయం తెలిసే అవకాశం ఉంది.

ఈ ప్రమాదంలో ఎంత మేర నష్టం జరిగిందో తెలియ రాలేదు. ఈ విషయంపై అగ్నిమాపక అధికారి కిష్టయ్యను సంప్రదించగా షెడ్డు,పైపులు కాలిపోయాయని చెట్లు కాలిన విషయం ఉదయంవరకు తెలుస్తుందన్నారు. అయితే చెట్లు కాలకుండా పూర్తిగా మంటలను ఆర్పివేసినట్టు తెలిపారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఇంత పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం సంభవించిన ఉద్యాన అధికారి కమలాకర్ అందుబాటులో లేడని ఆయన లేక పోవడం వల్లనే ఇంతటి ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



## ఎమ్మెల్యే అనుచరుల భూ కబ్జాలు బయటపడతాయనె భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆరోపణలు

### -సీనియర్ నేత పి నాగిరెడ్డి

కూకట్ పల్లి, జనవరి 20, ప్రజా కలం ప్రతినిధి: హౌసింగ్ బోర్డు స్థలాల ఓపెన్ ఆక్షన్ అంశము పట్ల కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఏ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి స్పందిస్తూ ఇటీవల బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు.

గడిచిన 10 సంవత్సరాల పాలనలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎన్నో హౌసింగ్ బోర్డు స్థలాలను కబ్జాలు చేసి నిర్మాణాలు నిర్మించుకున్నారు అని కూకట్ పల్లి నియోజకవర్గ ప్రాంతంలో కూడా ఎంతో విలువైన హౌసింగ్ బోర్డ్ స్థలాలు ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలు చేసుకున్నారని అన్నారు. ఈ కబ్జాలు అన్నీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కనుసన్నలలోనే జరిగాయని నాగిరెడ్డి ఆరోపించారు.

తెలుగు రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1960 వ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరాలి అనే ఉద్దేశంతో హౌసింగ్ బోర్డ్ అనేది స్వతంత్ర సంస్థగా ఏర్పడిందని గుర్తుచేశారు. హౌసింగ్ బోర్డు సంస్థ నిర్వీర్యం కావడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులే కారణం అని అన్నారు. మాధవరం కృష్ణారావు హౌసింగ్ బోర్డ్ స్థలాల ద్వారా వ్యక్తిగత లబ్ధి పొందేందుకు ప్రణాళిక చేసుకున్నారని, కానీ ఇప్పుడు హౌసింగ్ బోర్డు ఆ స్థలాలను వేలం నిర్వహించడం ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు అని నాగిరెడ్డి అన్నారు. భూ కబ్జాల అంశంలో ప్రధానంగా వినపడే పేరు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గారు అని కబ్జాల కృష్ణారావుగా ప్రజలు పిలుచుకుంటున్నందుకు సిగ్గ పడాల్సింది పోయి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేయడం చాలా విడ్డూరంగా ఉంది అన్నారు. హౌసింగ్ బోర్డ్ వారు స్థలాలను వేలం వేసే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తూ మిగులు స్థలాలను గుర్తించి మార్క్ చేసుకుంటున్నారు, ప్రజా వినియోగానికి అనువుగా ఉన్న స్థలాలను ఓపెన్ ఆక్షన్ పెడుతున్నారు . ఈ ప్రక్రియలో మాధవరం కృష్ణారావు అతని అనుచరులు కబ్జాలు చేసి అక్రమంగా నిర్మించుకున్నటువంటి ఎన్నో ఆస్తులు వెలుగులోకి వస్తాయి అని అతని అనుచరులు ఒత్తిడి తట్టుకోలేక మతిస్థిమితం లేని విధంగా మాట్లాడుతున్నారని గత పది సంవత్సరాల బి ఆర్ ఎస్ పాలనలో వేలకోట్ల రూపాయల ప్రభుత్వ భూములను అమ్ముకున్నారని నాగిరెడ్డి వ్యాఖ్యానించారు.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అంటే భారీ కట్టడాలు, పార్కులు, సుందరీ కారణాలకే పరిమితమైందని, అభివృద్ధిని ప్రజా జీవితాలకు అన్వయించడలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది అని, అన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను ప్రభుత్వ పథకాలకు అర్హులు కాకుండా మోసం చేసి దుర్మార్గపు పాలన చేశారని విమర్శించారు.

ఇది దొరల ప్రభుత్వం కాదు అని, రేవంత్ రెడ్డి హయాంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి, ప్రజా పాలన కొనసాగుతొందని తెలుసుకోవాలని నాగిరెడ్డి హితవు పలికా పలికారు.

## వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని సీజ్ చేయడం అనైతిక చర్య - ఎమ్మెల్యే కృష్ణారావు




కూకట్ పల్లి, జనవరి 20, ప్రజా కలం ప్రతినిధి:

గడిచిన సంవత్సర కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ అభివృద్ధిని అటుకెక్కించి ప్రభుత్వ స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్లది రూపాయల ప్రజాధనం వృధా చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్ పల్లి కె పి హెచ్ బి కాలనీలోని ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని హౌసింగ్ బోర్డ్ అధికారులు సీజ్ చేసిన విషయాన్ని తెలుసుకొని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిపి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వేణుగోపాల స్వామి ఆలయాన్ని పరిశీలించారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డు లోని జిహెచ్ఎంసి ఆధీనంలో ఉండే రమ్య గ్రౌండ్ పార్కు స్థలాన్ని సైతం హౌసింగ్ బోర్డ్ అధికారులు బోర్డులు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రజల సౌకర్యార్థం కె పి హెచ్ బి కాలనీలో మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులను, ఆట స్థలాలను క్రికెట్ గ్రౌండ్ లను ఏర్పాటు చేశామని దానికి విరుద్ధంగా రేవంత్ రెడ్డి సర్కార్ హౌసింగ్ బోర్డ్ స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు దండుకోవడం దారుణమన్నారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలలో ప్రజాప్రయోజనార్థం 10 శాతం భూములను గుడులకు, బడులకు, పార్కులకు కేటాయించాలని ఎలాంటి కేటాయింపులు చేయకుండా వేలం పాటలు ఏ విధంగా వేస్తారని ప్రశ్నించారు.

ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న దేవాలయ మండపానికి ఎవరికీ చెప్పకుండా ఎలా సీజ్ చేస్తారని కనీసం పంచనామా జరపకుండా ఆలయ సిబ్బందికి కమిటీకి చెప్పకుండా అధికారులు ఎలా సీట్ చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధోరణి మార్చుకోకపోతే ఈనెల 24 వ తారీఖున జరిగే వేలం పాటను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, రాజేష్,పవన్, పి.ఎల్ ప్రసాద్, సాయి,తదితరులు పాల్గొన్నారు.

## కటిక కులస్తులను సూర్యవంశ ఆరెకటికలుగా ధ్రువీకరించాలి

గజ్వేల్: 20 జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి )

కటిక కులస్తులను సూర్యవంశం ఆరికటికలుగా ధ్రువీకరించి కుల దృవీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కు గజ్వేల్ సూర్యవంశం అరెకటిక నాయకులు నర్సింగరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 1977 నుండి ఆరెకటిక అని తమ కులానికి పేరు వాడుకలోకి వచ్చిందని, అప్పటివరకు వివిధ పేర్లతో చలామణి కాగా 1977లో విద్యా కమిషన్ చేసిన సర్వేలో నిజం తెలుసుకొని తెలుసుకొని కటిక కులాన్ని ఆరెకటిక కులంగా ఉమ్మడి రాష్ట్రంలో పేరును కొనసాగించారన్నారు. ఆ తర్వాత 1994- 95లో మరికొందరి ప్రయత్నాల వల్ల పేర్లు మార్పు జరిగిన చివరికి ప్రభుత్వం నియమించిన సుబ్రహ్మణ్య కమిషన్ సూర్యవంశం, ఆరెకటిక కటిక పదానికి పర్యాయాలుగా వాడాలని వెల్లడించినట్లు నర్సింగరావు తెలిపారు. ఇప్పటివరకు కటిక కులస్తులు ఈ విధంగా కుల పేరును వినియోగించలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా సూర్యవంశ ఆరెకటిక ఒకే కులంగా పరిగణించి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధంగా బీసీ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పొట్ట స్వామి కమిషన్ వెల్లడించిన విధంగా ఆరెకటికలను బిసి.డి నుండి బీసీ.ఏ లోకి మార్చి సూర్యవంశం ఆరికటికులకు న్యాయం చేకూర్చాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్ ఇంప్లిమెంట్ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని బీసీలకు ఇచ్చే రిజర్వేషన్ 42 శాతానికి పెంచాలని కమిషన్కు నివేదిక ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ కార్ రమేష్, జమాల్పూర్ ప్రదీప్, కళ్యాణ్, చరణ్, తదితరులు పాల్గొన్నారు





# కురుమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ్ రెడ్డి

కల్వకుర్తి, జనవరి 20, (ప్రజా కలం)

కల్వకుర్తి నియోజకవర్గం కురుమ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను సాయంత్రం 5:00 గంటలకు కల్వకుర్తిలోని హైదరాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన



వేదిక మీద స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్ గారితో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కురుమ సంఘం కో ఆర్డినేటర్ కాలె వెంకటేష్ కురుమ, కల్వకుర్తి పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు నాదిరి బాల్ రామ్ కురుమ, నియోజకవర్గ కురుమ యువత ఉపాధ్యక్షులు కొంగళ్ళ శివప్రసాద్ కురుమ, జీడిపల్లి కాంగ్రెస్ నాయకులు కెంచ ఆంజనేయులు కురుమ, నాయకులు ప్యాట చక్రం కురుమ, గుండూరు రజిత కురుమ, నాదిరి నాగరాజు కురుమ, మరియు కురుమ కులబంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమలు నీతి నిజాయితీకి మారుపేరు అని కొనియాడుతూ కాంగ్రెస్ పార్టీ కురుమలకు పెద్దపీట వేస్తుందని కురుమలు కూడా రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

# నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిఎం



ప్రజాకలం ప్రతినిధి సంగారెడ్డి జనవరి 20 సంగారెడ్డి ఆర్టీసీ డైల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమం 21 వ తేదీ మంగళవారం రోజు ఉదయం 11 గంటలకు 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉపేందర్ చెప్పారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల రవాణా సౌకర్యం కొరకు 8500376267 ఈ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# ఫీల్డ్ వెరిఫికేషన్ వివరాలు తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జనవరి 20 :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, రూపొందించిన వివరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. చందూర్, అక్బర్ నగర్, రుద్రూర్ గ్రామాలను కలెక్టర్ సోమవారం



సందర్శించారు. స్థానిక అధికారులతో భేటీ అయ్యి, ఆహార భద్రత (రేషన్) కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించిన వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, కుటుంబ సభ్యుల ఆధార్ నెంబర్ ద్వారా వారి పేర్లు ఎక్కడైనా రేషన్ కార్డులో ఉన్నాయా లేవా అన్నది నిర్ధారించుకోవాలని సూచించారు. అక్బర్ నగర్ శివారులోని భూములతో పాటు, రుద్రూర్ బస్టాండ్ వెనుక భాగాన 897 నుండి 957 వరకు గల సర్వే నెంబర్లలోని భూములకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి పంటలు సాగు చేయకుండా వ్యవసాయేతర అవసరాలకు భూములను వినియోగిస్తుండడాన్ని, లే అవుట్ చేసి ప్లాట్లుగా మార్చడాన్ని గమనించిన కలెక్టర్, అధికారులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ యోగ్యంలో లేని భూములను పక్కాగా గుర్తించాలని, క్రాప్ బుకింగ్, భువన్ యాప్‌ల సహాయంతో వెరిఫికేషన్ చేయాలన్నారు. అధికారులు సేకరించిన క్షేత్రస్థాయి వివరాలతో కూడిన రిజిస్టర్లను తనిఖీ చేసి, గ్రామ సభల నిర్వహణపై సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా పకడ్బందీగా గ్రామ సభలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, చందూర్ ఎంపీడీఓ నీలావతి, తహసీల్దార్ శాంతా, ఇతర అధికారులు ఉన్నారు.

# నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎంపీ రఘునందన్ రావు

గజ్వేల్ నియోజకవర్గం:20 జనవరి 2025 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు మండల బి.జే.పి అధ్యక్షులు మన్నట శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు. ఈ సందర్భంగా ఎంపీ రఘునాథరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాల ప్రజలకు తెలియపరచాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగిని అరుణ్, హరికష్ణ నర్సింలు, బాస్కరెడ్డి , కుమార్, పప్రసాద్ దత్తు తదితరులు పాల్గన్నరు.





# టీజేఈయూ తోనే కార్మికులకు న్యాయం

## -చవ్వ సతీష్,కె రాజ్ రెడ్డి

## వాటర్ వర్క్స్ లో పదోన్నతులు మధుయాష్కీ చొరవే

హైదరాబాద్, జనవరి 20 (ప్రజాకలం ప్రతినిధి):

కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్(టీజేఈయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చవ్వ సతీష్, కె.రాజ్ రెడ్డి, ఎండీ. జహంగీర్, ఈ.చంద్రశేఖర్, రాఘవేందర్ రాజ్, సయ్యద్ అక్తర్ అలీ ఆరోపించారు. తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (టీజేఈయూ) ఆధ్వర్యంలో డివిజన్ -9 కేపీ హెచ్బీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి అద్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.. రెండు పర్యాయాలు అధికారిక యూనియన్ గా విజయం సాధించినా, కార్మికులకు ఇచ్చిన హామిలను నెరవేర్చలేదని ఆరోపించారు.



కార్మికులకు ఆరోగ్య బీమా, హైల్త్ కార్డుల విషయంలో తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. హెల్త్ కార్డు వాల్యూ రూ.5 లక్షలకు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆవేధన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో, టీజేఈయూ నాయకుల కృషితో వాటర్ వర్క్స్ లో జనరల్ ట్రాన్స్ ఫర్స్ విజయవంతంగా నిర్వహించామన్నారు కార్మికులు అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో టీజేఈయూను అధికారిక యూనియన్ గా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లి శ్రవాన్ కుమార్, బి.దేవేందర్, సయ్యద్ హాశం,సి.రాజు, బి.నర్సింగ్ రావు, బి.శంకర్ ప్రకాష్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్, గౌస్ పాషా, నరసింహారెడ్డి, మొగులయ్య, ఎం. రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జనవరి 20: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఆహార భద్రతా (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి శకటాలను ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. వీటితోపాటు గృహజ్యోతి, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణ మాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ప్రాధాన్యతను చాటేలా శకటాలను ప్రదర్శించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు గాను శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ, ఈ నెల 22వ తేదీ లోగా పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎర్గట్ల పాఠశాలలో అంటురోగాలపై అవగాహన సదస్సు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జనవరి 20:

జిల్లా పరిషత్ఉన్నత పాఠశాల ఎర్గట్ల విద్యార్థులకు విద్యాశాఖ మరియు ఎన్ జి ఓ నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో అంటురోగాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. యుక్త వయసులో ఉన్న బాల బాలికలకు ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయో, విద్యార్థులు ముఖ్యంగా ఇలాంటి వ్యాధుల పట్ల ఎలాంటి అవగాహన కలిగి ఉండాలో తెలుపుతూ, హెచ్ఐవి, మరియు ఎయిడ్స్ వ్యాధుల గూర్చి విద్యార్థులు తెలుసుకోవాలని కోర్సు డైరెక్టర్ మల్లికార్జున్ మరియు సరిత తెలిపారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు క్విజ్ పోటీలు మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



# సనాతన్ ధర్మం బౌద్ధ ధమ్మమే

## - డాక్టర్ విలాస్ ఖరాత్




ముంబై,(ప్రజా కలం ప్రతినిధి) జనవరి 20:

బుద్ధుడి పూర్వం ఏ సాహిత్యంలోను "సనాతన్" అనే పదం లభించదని, కేవలం తథాగత బుద్ధుడు తమ ప్రవచనంలో "ఎసే ధమ్మో సనానతో" అంటూ పలు సార్లు ఉపయోగించారు. దాని అర్థం "ప్రజలందరూ సమానమే". ఆయన బోధనలే సనాతనం అంటూ ప్రజల నానుడిగా ఉండేదని ప్రఖ్యాత భారతీయ చరిత్రకారుడు డాక్టర్ విలాస్ ఖరాత్ తెలిపారు.

సనాతన్ ధమ్మ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ముంబై తూర్పు కాందివలిలోని నలందా బుద్ధ విహార్ ప్రాంగంలో మాత జీజావు, చదువుల తల్లీ సావిత్రిమాయి, ఫాతిమా షేక్, మాత రమాయిల సంయుక్త జయంతి నిమిత్తంగా ప్రబోధన సమ్మేళనం జరగింది. ఇందులో ప్రధాన వక్తగా డిల్లీ నుంచి విచ్చేసిన సనాతన్ ధమ్మ సుప్రీం డాక్టర్ విలాస్ ఖరాత్ మాట్లాడుతూ సావిత్రిమాయి సహచర్ని ఫాతిమా షేక్ కాల్పనికం అసల్కే కాదని ఖండించారు. శివాజీ మహారాజ్ జననం బుద్ధిష్ట్ గుహల్లో (గుఫాలో) జరిగిందని, ఆయన రెండవ రాజ్యాభిషేకం శాక్య పంథ్ అనగా బౌద్ధ సంప్రదాయాలతో జరిగిందని నిజ చరిత్రను సవిస్తరంగా తెల్పారు. రాబోయే రోజుల్లో ముంబై మహానగరంలో బౌద్ధ విహారాలన్ని అధ్యాయనాలకు ఉద్యమానికి కేంద్రాలు కావాలని పిలుపునిస్తూ, అట్టి దానికి తాను స్వయంగా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో మహిళా నాయకురాలు పూలతాయి జాదవ్, బంతే కశ్యప్, దళిత పాంథర్ నేత రవి ఇర్వే, మహేష్ డోంగ్రే, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.